క్లుప్తంగా

జేసీఎస్ మండల కన్వీనర్ నియామకం



బసవరాజు

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బసవరాజును జేసీఎస్ మండల కన్వీనర్‌గా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం నియమించినట్లు ఆదివారం ఆస్పరిలో మండల సొసైటి చైర్మన్ కట్టెల గోవర్ధన తెలిపారు. బసవరాజు నియామకం పట్ల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలందరికీ అందేలా చేస్తానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కమ్యూనిటీ హాళ్లకు మోక్షం కలిగేనా ?



గుండాలతండాలో అర్ధాంతరంగా నిలిచిపోయిన కమ్యూనిటీ భవన నిర్మాణం

తుగ్గలి: మండలంలోని పలు గ్రామాల్లో కమ్యూనిటీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 20 ఏళ్ల క్రితం మండలంలోని చిగుర్లగుట్ట తండా, చెర్వుతండ, లక్ష్మితండా, గుండాలతండా, జొన్నగిరి, చెన్నంపల్లి, ముక్కెల్లలో కమ్యూనిటీ భవన నిర్మాణాలకు అప్పట్లో ఒక్కొక్కదానికి రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రూఫ్ లెవెల్ వరకు చేసి నిధులు చాలకపోవడంతో అప్పట్లో ఆపేశారు. శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉపయుక్తంగా నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతి నిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేసేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేయాలి

పత్తికొండ రూరల్: హోసూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి సస్పెన్షన్‌కు గురైన ఇంగ్లిష్ టీచర్ కేవీ రమణపై సుమోటోగా పోలీసులు కేసు నమోదు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యుజి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బాలికలను వేధించిన ఘటనపై మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో నిజనిర్ధారణ చేశామన్నారు. నిందితుడు రమణ గతంలో పనిచేసిన పుచ్చకాయలమాడ హైస్కూల్లో కూడా ఇదే ఆరోపణలు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మానవ హక్కుల వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఉరుకుందప్ప, కారప్ప, కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకులకు గాయాలు

వెల్దుర్తి/డోన్: డోన్ మండలం ఏనుగుమర్రి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన కారు ప్రమాదంలో వెల్దుర్తి మండలానికి చెందిన టీడీపీ నాయకులు, వారి కుటుంబ సభ్యులు గాయపడ్డారు. గుత్తి బాట సుంకులమ్మ వద్ద ఫంక్షన్‌కు కారులో వెళ్లిన టీడీపీ వెల్దుర్తి మండల ఉపాధ్యక్షుడు చెర్ల కొత్తూరుకు చెందిన పుల్లయ్య, అతని సోదరులు సోమశేఖర్, అయ్యపురెడ్డి, మంగంపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు శ్రీను తిరుగు ప్రయాణమయ్యారు. ఏనుగుమర్రి వద్ద వస్తుండగా కారు టైరు పంక్చరై పల్టీలు కొడుతూ ఎడమవైపు రోడ్డు పక్కనున్న ఖాళీ స్థలంలో పడింది. కారులోని వారు గాయపడగా సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్, 108 వాహన సిబ్బంది తమ వాహనాలలో కర్నూలుకు తరలించారు. క్షతగాత్రులు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రారంభానికి సిద్ధం

మద్దికెర: రైతులకు సత్వర సేవలు అందించేందుకు చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు ఒక్కొక్కటిగా పూర్తవుతున్నాయి. మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో రూ.21.5 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం పూర్తి చేసుకొని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ గంపల వెంకటేశులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బురుజుల శేఖర్ ఆదివారం తెలిపారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మద్దికెర: ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అమలుచే స్తున్న పథకాలను వారికి సకాలంలో అందించడంలో వీఓఏలు ప్రముఖ పాత్ర వహిస్తున్నారని, వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ అధ్యక్షుడు బసవరాజు కోరారు. ఆదివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో వీఓఏల మండల అధ్యక్షుడు మల్లికార్జున సమావేశం నిర్వహించారు. వీఓఏల సమస్యలపై చర్చించారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక: వీఓఏల సంఘం అధ్యక్షుడిగా మల్లికార్జున, కార్యదర్శిగా ఎం.ఉదయ్‌మోహన్‌రెడ్డి, కోశాధికారిగా రాముడు, ఉపాధ్యక్షులుగా జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఒప్పంద అధ్యాపకుల జీవితాల్లో వెలుగులు

- రెగ్యులర్ చేస్తూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై హర్షం
- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపిన అధ్యాపకులు



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరించి ధన్యవాదాలు తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు (ఫైల్)

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ కళాశాలల్లో దాదాపు 22 ఏళ్లుగా పనిచేస్తూ చాలీచాలని వేతనాలతో బతుకు బండిని సాగిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయంతో వెలుగులు నిండనున్నాయి. ఎన్నో ఏళ్లుగా తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని గత ప్రభుత్వాలను విన్నవించినా పట్టించుకొన్న పాపాన పోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కాంట్రాక్ట్ ఉద్యోగులు, అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు గత క్యాబినేట్ సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియ రెండు నెలల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడంతో కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 22 సంవత్సరాల తమ కల నెరవేరబోతుందని ఇకపై కాంట్రాక్టు నుంచి తమను విముక్తులు చేశారని వారు పేర్కొంటున్నారు. ఒకప్పుడు రూ.5 వేలకు కాంట్రాక్ట్ అధ్యాపకులుగా ఉద్యోగంలో చేరిన తమకు రెగ్యులర్ అయితే దాదాపు రూ.80 వేల వరకు వేతనం పెరుగుతుందని ఆనందంగా పేర్కొంటున్నారు. 2-6-2014 వరకు సర్వీసులో ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ మేరకు వారు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు బాలికల, బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు గోనెగండ్ల, నాగులదిన్నె కళాశాలల అధ్యాపకులు స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరించి ఆయనతో పాటు సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ఫ్లకార్డులతో హర్షం వ్యక్తం చేశారు.

సంతోషంగా ఉంది



కాంట్రాక్టు అధ్యాపకుడిగా తక్కువ వేతనం తీసుకుంటూ 2004 నుంచి పనిచేస్తున్నా ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ రెగ్యులర్ చేసేందుకు క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.

– రంగన్న, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎమ్మిగనూరు

తక్కువ వేతనంతో పనిచేశా



2003లో కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా పనిలోచేరి రూ.5500 వేతనం తీసుకుంటూ అలానే పనిచేస్తూ వచ్చాను. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేందుకు పూనుకోవడంతో మా సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి. రెగ్యులర్ అయితే వేతనాలు భారీగా పెరగనున్నాయి. సీఎంకు మా కుటుంబాలు ఎప్పటికి రుణపడి ఉంటాయి.

– మల్లికార్జునస్వామి, అధ్యాపకుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గోనెగండ్ల

ఇచ్చిన హామీ నెలబెట్టుకున్నారు



22ఏళ్లుగా కాంట్రాక్టు అధ్యాపకులుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న మా మొరను ఆలకించిన సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని కాంట్రాక్టు అధ్యాపకుల జీవితాల్లో వెలుగులు నింపారు.

– రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకుడు, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు

మా కుటుంబాలు బాగుపడతాయి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో మా కుటుంబాలు బాగుపడతాయి. 2004 సంవత్సరం నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకురాలిగా పనిచేస్తూ రెగ్యులరైజ్ కోసం ఎదురుచూసేదాన్ని. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ రెగ్యులర్ చేసేందుకు శ్రీకారం చుట్టడంతో ఆయన రుణపడి ఉంటాం. – సూర్యకుమారి, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు

ఈరోజు

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు

వెల్దుర్తి: రామళ్లకోట, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లకు సరఫరా అందించే కృష్ణగిరి 220 కేవీ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం వ్యవసాయ విద్యుత్ (త్రీఫేజ్) వేళల్లో మార్పు చేసినట్లు వెల్దుర్తి విద్యుత్ ఏఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం ప్రతి దినం రామళ్లకోట, కలుగొట్ల పరిధిలో రైతులకు ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఇచ్చే సరఫరాలో మాత్రమే మార్పు ఉందన్నారు. మారే వేళల ప్రకారం ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 6 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. రైతులు గమనించాలని కోరారు.

చెల్లిచెలిమెలకు మంత్రి రాక

దేవనకొండ: మండలంలోని చెల్లిచెలిమెల గ్రామంలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ మల్లికార్జున ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

28న మాదిగల చైతన్య యాత్ర

వెల్దుర్తి: ఈనెల 28న కర్నూలులో జరిగే మాదిగల రాజకీయ చైతన్య యాత్ర సదస్సు జయప్రదం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి నవీన్ మాదిగ పిలుపునిచ్చారు. ప్రారంభ కార్యక్రమానికి సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరపోగు వెంకటేశ్వర రావు హాజరవుతారన్నారు. మాదిగల రాజకీయ చైతన్యం కోసం, జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు రాజకీయంగా సీట్లు కేటాయించాలన్న డిమాండ్‌తో జిల్లావ్యాప్తంగా చైతన్య యాత్ర సాగుతుందన్నారు.

కరుణించిన వరుణుడు

తుగ్గలి: ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. జూన్ నెలాఖరైనా ఇంతవరకు మంచి వాన పడకపోవడం, మరోవైపు అదను దాటుతుందేమోనని రైతులు ఒకింత ఆందోళన చెందారు. అయితే ఆదివారం సాయంత్రం మండలంలోని చాలా గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. జొన్నగిరి, బొందిమడుగుల, రాంపల్లి, ఆర్.కొట్టాల, రామలింగాయపల్లి, పగిడిరాయితో పాటు పలు గ్రామాల్లో పదునైన వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జొన్నగిరి, ఆర్.కొట్టాల పొలాల్లో అక్కడక్కడ పొలాల్లో నీరు నిలిచాయి. అదనులో వర్షం పడడంతో రైతులు విత్తుకు సిద్ధమయ్యారు.

కృష్ణగిరి: మండలవ్యాప్తంగా ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం ఆయా గ్రామాల ప్రజలు, రైతుల్లో ఆనందం నింపింది. రుతుపవనాల ప్రభావంతో మంచి సమయంలో వర్షం రావడంతో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఐదు రోజుల క్రితం కురిసిన వర్షానికి విత్తన సాగు చేపట్టిన అన్నదాతలకు ఈ వర్షంతో పూర్తిస్థాయి సాగు చేసేందుకుఉపయోగపడుతుందని తెలిపారు.



పెనుమాడ సమీపంలో కురుస్తున్న వర్షం

హొళగుంద: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల పరిధిలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా చినుకు జాడలేక సాగులో ఉన్న పత్తి, మిరప తదితర పంటలకు తడుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో వర్షం ఊపిరిపోసింది. ఓ మోస్తారుగా తేలిక పాటి వర్షం కురవడంతో పొలాల్లో తడి ఏర్పడింది.



ఆర్.కొట్టాల వద్ద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

హాలహర్వి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం తొలకరి జల్లులు రైతులను పలకరించాయి. ఓ మోస్తారు వర్షం కురవడంతో రైతులు సంబరపడ్డారు. మండలంలోని విరుపాపురం, నిట్రవట్టి, బిలేహాల్, గూళ్యం, సిద్ధాపురం తదితర గ్రామాల్లో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతన్నలు ఇప్పటికే పొలాలను దుక్కి దున్నుకుని పంటల సాగుకు సిద్ధంగా ఉన్నారు. నేల పూర్తిస్థాయిలో తడిసేలా వర్షం పడితే విత్తు విత్తుకునేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

చిరుత జాడపై అన్వేషణ



నల్లకొండలో చిరుత జాడను అన్వేషిస్తున్న అటవీ శాఖ అధికారులు

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామ సమీపంలోని కొండల్లో చిరుత సంచరిస్తున్నట్లు మేకల కాపర్లు గుర్తించారు. శనివారం సాయంత్రం మందలోని ఓ మేకపై చిరుత దాడి చేయగా గుమనించిన కాపర్లు రాళ్లు విసరడంతో చిరుత పరారైనట్లు కాపరి కృష్ణ తెలిపారు. విషయం తెలుసుకున్న డోన్ ఫారెస్టు బీట్ అధికారి కాళిదాసు ఆదివారం గ్రామానికి చెరుకుని నల్లకొండ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ చిరుత చంపి తిన్న జంతువుల ఎముకలను గుర్తించారు. అలాగే చిరుత దాడి చేసిన మేకను పరిశీలించారు. చిరుతకు ఆహారం దొరకకపోతే వేరే ప్రాంతానికి వలస వెళుతుందని, మనుషులకు ఎలాంటి ప్రాణహాని ఉండదని, ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని సూచించారు. మరోమారు కనిపిస్తే తమకు తెలియజేయాలని గ్రామస్తులను కోరారు.

రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం



నిర్మాణ పనులు ప్రారంభమైన దృశ్యం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామం బీసీ కాలనీలో ఎంపీ నిధులు రూ.30 లక్షలతో మైనారిటీ కమ్యునిటీ హాలు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ శేషయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగారెడ్డి తెలిపారు. ఆదివారం ఎన్నో ఏళ్లుగా మైనారిటీలు కమ్యునిటీ హాలు నిర్మించాలని కోరుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లగా ఎంపీ ల్యాడ్స్ మంజూరు చేయించినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సకాలంలో పనులు పూర్తి చేయాలని డీఈ ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి ఉన్నారు.

భజన కళాకారుడికి పురస్కారం

తుగ్గలి: తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు నిర్వహించిన కార్యక్రమంలో తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన చెక్క భజన కళాకారుడు రాజు 2023 ఉత్తమ అవార్డును అందుకున్నారు. సంస్థ చైర్మన్ రాజ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు గౌరీశంకరాచార్యులచే అవార్డు అందుకున్నట్లు రాజు తెలిపారు. పల్లెల్లో చెక్క భజన ప్రదర్శనలు ఇస్తున్న తనను గుర్తించి జాతీయ పురస్కారానికి ఎంపిక చేయడం సంతోషంగా ఉందని రాజు తెలిపారు. 30 ఏళ్లుగా చెక్క భజనలో ప్రదర్శనలు ఇస్తున్నట్లు పలువురికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు.



గుంటూరులో పురస్కారం అందుకుంటున్న రాంపల్లి రాజు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఎమ్మిగనూరు టౌన్: గోనెగండ్ల మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో మైనర్ బాలికపై అఘాయిత్యానికి ప్రయత్నించిన నిందితుడు బడే సాబ్‌ను కఠినంగా శిక్షించాలని ఎమ్మిగనూరు పట్టణ ఉప్పర సగర సంఘం అధ్యక్షుడు యుకె రాజ శేఖర్, ఉపాధ్యకుడు రంగన్న డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ అభంశుభం తెలియని చిన్నారిపై అఘాయిత్యానికి ప్రయత్నించడం ఘోరమన్నారు. నిందితుడిపై పోక్సో చట్టం మేరకు కేసు నమోదు చేసి, సహకరించిన అతని భార్యపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ సంఘం అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కృష్ణగిరి: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఆయన ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనదారుడు రహదారి నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి, జరిమానా వసూలు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలు అరికడతాం

హాలహర్వి: మండలంలో గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హాలహర్వి ఎస్‌ఐ నాగేంద్ర పేర్కొన్నారు. నూతనంగా భాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ నాగేంద్రను ఆదివారం వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రశాంతంగా అందరు కలసిమెలసి జీవించాలన్నారు. అనంతరం బాపురం గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ, నాయకులు నాగేంద్ర, పచ్చార్లపల్లి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి, శివరాజ్‌గౌడు, చెన్నబసప్ప ఆచారి, సుగుణగౌడు తదితరులు ఎస్‌ఐను కలిసి గ్రామాల్లో శాంతిభద్రతలపై చర్చించారు. అనంతరం ఆయన్ను పూలమాలలతో ప్రత్యేకంగా సన్మానించారు.



హాలహర్వి ఎస్‌ఐ నాగేంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ పూజారులు మహేశ్ స్వామి, మల్లప్ప స్వామి స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, భండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నిరాజన తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఆస్పరి మఠంలో భక్తులకు అన్నదానం చేశారు.



మాళ మల్లేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

30 నుంచి వరుణయాగ పూజలు

రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 30 నుంచి జూన్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు వరుణయాగ పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మతగేరి తప్పెట రామిరెడ్డి ఆదివారం తెలిపారు. బెల్దోణ రామశాస్త్రి ఆధ్వర్యంలో వరుణయాగ పూజలు నిర్వహిస్తారని, ఇందుకోసం ఆలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు పాడి పశువులతో సుఖంగా ఉండాలని అలాగే సమాజ శ్రేయస్సు కోసం వరుణయాగం, కుంభోత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు రామిరెడ్డి తెలిపారు. భక్తులు పాల్గొని దేవుడి ఆశీస్సులు పొందాలన్నారు.

సమాచారం చెప్పేదెవరో?

చిప్పగిరి: మండలంలోని ప్రజలు ప్రభుత్వ శాఖల సేవలకు సంబంధించిన సమాచారం కావాలంటే ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, సూపరింటెండెంట్ తదితర అధికారులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఎంపీడీఓగా సీవీ కొండయ్య, సూపరింటెండెంట్‌గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఈఓపీఆర్డీగా సంజన్న గతం నుంచే కొనసాగుతున్నారు. అయితే సమాచార హక్కు చట్టం బోర్డులో వారి పేర్లేవి కనబడక ఖాళీగా దర్శనమిస్తోంది. దీంతో వివిధ సమాచారం కావాల్సిన వారు ఎవరిని సంప్రదించాలో తెలియక వెనుదిరిగి పోతున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు వారి పోన్ నంబర్లు ప్రదర్శించాలని కోరుతున్నారు.



అధికారుల పేర్లు లేకుండా ఖాళీగా ఉన్న సమాచార హక్కు చట్టం బోర్డు

అనారోగ్యంతో బాలిక మృతి

పత్తికొండ రూరల్: పత్తికొండలోని ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న ఫకృన్నీసా కుమార్తె పక్కీర్ రుక్సార్ (11) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. బాలిక స్థానిక శాంతి టాలెంట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతుంది. తీవ్రమైన తల నొప్పి, వాంతులు రావడంతో చికిత్స నిమిత్తం బాలికను పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు బాలిక తల్లిదండ్రులు తెలిపారు.



పక్కీర్ రుక్సార్ (ఫైల్)

నకిలీలతో జాగ్రత్త

- మార్కెట్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాల బెడద
- ఖరీఫ్‌లో అమ్మకానికి యత్నం
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు

హొళగుంద: ఖరీఫ్ సీజన్‌లో తొలకరి వర్షాలు పలకరించడంతో రైతన్నలు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో ప్రభుత్వం అనేక రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. మార్కెట్లో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా చలామణిలో ఉన్నాయి. ఈ విషయం రైతులను ఆందోళనకు గురి చేస్తుండగా, అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని అన్ని వివరాలను పరిక్షించిన తర్వాతే కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.




ఇటీవల పట్టుబడిన నకిలీ విత్తనాల ప్యాకెట్లు (ఫైల్)

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- లైసెన్స్ లేని వ్యక్తులు, దుకాణాలు, దళారులు, ఇతరత్రా వ్యాపారుల నుంచి కొనుగోలు చేయరాదు
- సరుకు లాట్ నంబర్, తయారీ తేదీ, రకం, ఇలా అన్ని వివరాలు కలిగిఉంటేనే కొనాలి. విక్రయదారుల నుంచి తప్పనిసరిగా బిల్లు పొందాలి.
- సీలు సక్రమంగా ఉన్న వాటినే తీసుకోవాలి.
- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బస్తాలో లభించే చీటీ (ట్యాగ్) ఉందో లేదో గమనించాలి. చీటి ఉంటేనే కొనుగోలు చేయాలి. ఆ చీటిని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలి.
- క్రిమీ సంహారక మందుల డబ్బాపై కంపెనీ పేరు, తయారీ తేదీ, కాల పరిమితిని గమనించి అందుకు అనుగుణంగా బిల్లులు తీసుకోవాలి.
- ఏదీ ఎంత ధరకు కొన్నా డీలర్ లేదా దుకాణాదారుడి సంతకంతో బిల్లు పొందాలి. నకిలీవని అనుమానం వస్తే మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చు.
- లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- నకిలీవని తేలితే సంబంధిత డీలర్, కంపెనీ దుకాణదారునిపై కేసు నమోదు చేస్తారు.

అనుమతి లేని విత్తనాలు కొనొద్దు



రైతులు ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసి మోసపొవద్దు. బ్యాచ్ నంబర్ లేని పురుగు మందులు కొనుగోలు చేయరాదు. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలి. కచ్చితంగా దుకాణదారుడి నుంచి బిల్లు తీసుకోవాలి.

– ఆనంద్ లోకదశ్, వ్యవసాయాధికారి, హొళగుంద

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం

వెల్దుర్తి: వర్షాకాలం మొదలైందంటే విద్యుత్ ప్రమాదాలు మొదలైనట్లే. వర్షాలు, గాలులకు చెట్ల కొమ్మలు విరిగి స్తంభాలపై పడడం, విద్యుత్ తీగలు తెగిపడడం జరుగుతుంటాయి. వీటిని గమనించకపోతే ప్రమాదాలకు అవకాశముంది. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉండడం, వాటికి సరైన రక్షణ ఏర్పాటు లేకపోతుండడం సైతం ప్రమాదాలకు కారణమౌతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు లోపాలను సరిచేయాల్సిన అవసరం ఉంది.

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు ఏఈ రాఘవేంద్రప్రసాద్ (సెల్ నంబరు.94408 13371) సూచించిన జాగ్రత్తలు

- విద్యుత్ స్తంభాలను తాకరాదు. వాటికిఉన్న టెలిఫోన్, టెలివిజన్, ఫైబర్ నెట్ కేబుళ్లు తాకరాదు.
- తడి చేతులతో స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయరాదు.
- అతుకుల విద్యుత్ తీగలు ఉంటే వెంటనే మార్పించుకోవాలి.
- నీటి గచ్చుల వద్ద, గోడలకు తడి ఉండి చిన్న షాక్ కొడుతుంటే వెంటనే ఎలక్ట్రీషియన్ ద్వారా సరిచేయించుకోవాలి.
- విద్యుత్ సర్వీసు వైరుకు సపోర్టుగా ప్లాస్టిక్ తొడుగు ఉన్న జీఏ వైరును మాత్రమే ఉపయోగించాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి.
- వర్షం పడుతున్న సమయంలో మోటార్లను ఆన్ చేయరాదు.
- రోడ్డు మీద, నీటిలో విద్యుత్ తీగ పడి ఉంటే దాన్ని తాకవద్దు. తీగ మీద వాహనాలలో వెళ్లరాదు.
- ఎవరికైనా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైతే రక్షించడానికి ప్లాస్టిక్, చెక్క వస్తువులు వాడాలి.
- తక్కువ ఎత్తులో తీగలు ఉంటే విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వాలి.
- వ్యవసాయ పంపుసెట్లకు, స్టార్టర్లకు విధిగా ఎర్తింగ్ పెట్టుకోవాలి.
- అనధికారికంగా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతరత్రా విద్యుత్ పరికరాల వద్ద ఫ్యూజులు మార్చడం, మరమ్మతులు చేపట్టడం చేయెద్దు.
- భవన నిర్మాణ పనుల్లో విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలి.
- అనధికార వ్యక్తులు విద్యుత్ స్తంభాలు ఎక్కరాదు. సొంతంగా వైరింగ్ పనులు చేయరాదు.
- విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టడం వంటివి చేయరాదు.